సాక్షి మహబూబాబాద్

శనివారం । 2 । నవంబర్ । 2024



ఎలక్ట్రిక్..నో పొల్యూషన్

వరంగల్ రీజియన్ రోడ్లపై తొలిసారి కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి.

- 8లో



ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

ములుగు జిల్లా మంగపేటలోని బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్ పోస్టు వద్ద ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం 36.7°/22.8°

వాతావరణం

ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లుల నుంచి మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



గార్ల: మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు గార్ల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. చోరీ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. డీఎస్పీ వెంట గార్ల బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై జీనత్‌కుమార్, ఏఎస్సై రవీందర్, సిబ్బంది ఉన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ సరికాదు’



మరిపెడ: ఎస్సీ వర్గీకరణ సరికాదని, అది రాజ్యాంగ విరుద్ధమని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన మాల మహానాడు పాదయాత్ర శుక్రవారం మరిపెడకు చేరుకుంది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. దళితుల రాజ్యాధికారం కోసం మంద కృష్ణ కలిసిరావాలన్నారు. దళితులు రాజ్యాధికారం కోసం పనిచేయకుండా విచ్ఛిన్నం చేసే ఊబిలోనే మంద కృష్ణ మాదిగ ఉన్నారని మండిపడ్డారు. న్యాయ వ్యవస్థను సైతం ప్రభావితం చేసేలా కేంద్రప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. పాదయాత్రలో జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, చిట్టమల్ల మహేశ్, బొడ్డు అశోక్, గుమ్మడి ప్రభాకర్, మెరుగు సంజీవ, రాకేశ్, సంజీవరావు, వెంకన్న, అనిల్, వీరన్న, చిన్ని, వెంకటమల్లు, పాపయ్య, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

నెహ్రూసెంటర్: పారామెడికల్ డీఎంఎస్‌టీ, డీఈసీజీ కోర్సుల్లో అడ్మిషన్ దరఖాస్తుల గడువు ఈ నెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్, స్వీయ ధ్రువీకరణతో దరఖాస్తులను ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలని సూచించారు. అప్లికేషన్‌లో తప్పుడు సమాచారం, సంబంధిత సర్టిఫికెట్లను సమర్పించని దరఖాస్తులను తిరస్కరించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.tspmb.telangana.gov.in వెబ్‌సైట్ పూర్తి వివరాలు చూడవచ్చన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



తొర్రూరు: ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలని డీఎం పద్మావతి అన్నారు. ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని డిపోలో సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి పాటుపడే ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ రజిత, ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఏఎంఎఫ్ సమద్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, సతీష్, ఉమలు పాల్గొన్నారు.

సింగరేణి జీఎం బదిలీ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్‌ను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో మణుగురు ఏరియా ఎస్‌ఓటు జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఇనుగు రాజేశ్వర్‌రెడ్డిని బదిలీ చేశారు. హబీబ్‌హుస్సేన్‌ను కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ జీఎంగా బదిలీఅయ్యారు. భూపాలపల్లి ఏరియాకు 8 నెలల క్రితమే బదిలీపై వచ్చిన ఆయన పలు వివాదాస్పదమైన విధానాలు ప్రవేశపెట్టి కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకుల వినతులు, ఫిర్యాదులు కూడా పట్టించుకోకుండా విధులు నిర్వహించారని ఆరోపణలున్నాయి. జీఎం కార్యాలయానికి కార్మికులు, స్థానికులు వారి అవసరాలకు రావాలంటే అనేక ఆంక్షాలు విధించి కార్మికులతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బందిని కూడా ఇబ్బందులకు గురి చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

పడకలపై కనీసం బెడ్ షీట్లు లేని వైనం

- పనిచేయని ఏసీలు.. ఏఎంసీ, ఐఎంసీలలో కానరాని మానిటర్లు
- మంత్రి ఆదేశించినా.. కలెక్టర్ సందర్శించినా ఫలితం శూన్యం

యమజీఎం!

ఎంజీఎంలో అధ్వానంగా అత్యవసర విభాగాల సేవలు





ఎంజీఎం :

‘నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానాకు అన్న పాట వినగానే ప్రతి ఒక్కరికీ అంత అధ్వానంగా ఉంటాయా ప్రభుత్వ ఆస్పత్రి సేవలు అనుకుంటారు. కానీ ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి క్యాజువాలిటీని పరిశీలిస్తే ఆ పాట నిజమే అనిపిస్తుంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగిని తీసుకువస్తే బతికిస్తారా.. అన్నది అనుమానమే. ఆస్పత్రి సేవలపై రోగులకు భరోసా కల్పించడంలో వైద్యాధికారులు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిలీవర్ వైద్యురాలు రాకముందే డ్యూటీలో ఉన్న వారు ‘నా విధులు 8 గంటల వరకే’ అని పేర్కొంటూ పోస్ట్‌గ్రాడ్యుయేట్ వైద్యులకు అప్పగిస్తూ వెళ్లిపోతున్నారు. 24గంటల పాటు అందుబాటులో ఉండాల్సిన డ్యూటీ వైద్యులు ఫోన్ చేసి రావాలని చెబితే 15 నుంచి 25 నిమిషాల సమయం తరువాత ఆ రోగి వద్దకు చేరుకుంటారు. ఆ లోపు ఉన్న ప్రాణం కాస్త గాలిలో కలిసే పరిస్థితి. అదేవిధంగా తలపగిలి తీవ్ర రక్తస్రావంతో వచ్చే రోగులను మెరుగైన సేవల కోసమంటూ హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ రకమైన సేవలతో ఎంజీఎం ఆస్పత్రిపై పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనిచేయని ఏసీలు..

పరిపాలనాధికారులు తమ గదుల్లో 24 గంటలపాటు ఏసీలు పనిచేసేలా చూసుకుంటారు. కానీ ఏఎంసీ, ఐఎంసీ(అత్యవసర వార్డులు), క్యాజువాలిటీలలో నెలల తరబడి పనిచేయకపోయినా పట్టించుకోవడం లేదు. కాలిన గాయాలతో వచ్చే రోగులకు పూర్తిస్థాయి ఏసీ గదుల్లోనే చికిత్స అందించాల్సి ఉంటుంది.

సమీక్షలు నిర్వహించినా ఫలితమేదీ..?

40 రోజుల క్రితం స్వయంగా జిల్లా మంత్రి కొండా సురేఖతో కలిసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఓ రోగి తనకు ఔషధాలు బయట కొనుగోలు చేయాలని చెప్పారని మంత్రి దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ డాక్టర్ ఎవరో తెలుసుకుని సస్పెండ్ చేయాలని చెప్పారు. స్వయంగా రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ, ఐఏఎస్ అధికారి ఆస్పత్రి సందర్శించి డీఎంఈ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించి ఆస్పత్రికి ఎలాంటి ఔషధాలు కావాలో.. ఏయే మౌలిక సదుపాయాలు కావాలో చెప్పాలని నివేదికలు రూపొందించారు. కలెక్టర్ సత్యశారద ఆస్పత్రిని రెండు, మూడు సార్లు తనిఖీ చేసి సేవలు మెరుగపరచాలని ఆదేశించి పలువురు వైద్యులకు మెమోలు జారీ చేశారు. అయినా వైద్యుల సమయపాలనలో మార్పు రావడం లేదు. కనీసం ఆస్పత్రిలోని క్యాజువాలిటీతోపాటు ఏఎంసీ, ఐఎంసీ విభాగాల్లో పడకలపై బెడ్ షీట్లు కూడా లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.



ఎంజీఎం ఆస్పత్రిలోని పడకలపై లేని బెడ్‌షీట్లు (ఇన్‌సెట్‌లో) ఎమర్జెన్సీ విభాగంలో పనిచేయని ఏసీలు

అధ్వానంగా అత్యవసర వార్డులు..

ఎంజీఎం ఆస్పత్రిలో ఏఎంసీ, ఐఎంసీ క్యాజువాలిటీ విభాగంలోని అబ్జర్వేషన్ గదులు ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులకు సేవలందించేందుకు కీలకమైనవి. ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ వైద్యులు, పీజీలు, హౌస్‌సర్జన్‌లు నిత్యం వచ్చే వందలాది మంది రోగులకు అందుబాటులో ఉండి చికిత్స అందిస్తూ ఉండాలి. కనీసం ఆయా విభాగాధికారులు.. ఈ విభాగాల పర్యవేక్షణను పట్టించుకోకపోవడంతో సేవలు అధ్వానంగా మారినట్లు స్పష్టమవుతోంది. రోగులు స్ట్రెచర్లపై పడుకుని ‘మా పడక ఎప్పుడు దొరుకుతుందా.. డాక్టర్ ఎప్పుడు చూస్తాడా’ అని ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.

బెడ్‌షీట్ల కొరత ఉంది..



ఎంజీఎం ఆస్పత్రిలో బెడ్‌షీట్ల కొరత ఉంది. క్యాజువాలిటీ రిలీవర్ వైద్యులు రాకుండా సమయం ముగిసిందని డ్యూటీ వైద్యులు వెళ్లిపోతే చర్యలు తీసుకుంటాం. క్యాజువాలిటీ ఏసీలు మరమ్మతు చేయిస్తాం.

- డాక్టర్ మురళి, ఎంజీఎం సూపరింటెండెంట్

నేటినుంచి వీరన్న సన్నిధిలో కార్తీక మాస పూజలు



భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో నేటి(2వ తేదీ) నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారికి పూర్ణాభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు ఉదయం పూర్ణాభిషేకం, రామలింగేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 5న నాగేంద్రస్వామి ఆలయంలో నాగుల చవితి కార్యక్రమం, ప్రతీ రోజు సాయంత్రం 6గంటల నుంచి సామూహిక దీపోత్సవం ఉంటుందని తెలిపారు. పాల్గొనే మహిళాభక్తులకు ఉచితంగా మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ప్రతీ సోమవారం రోజు సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఉంటుందని, కార్తీక పౌర్ణమి(15న) జ్వాలా తోరణం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 29న మాస శివరాత్రిని పురస్కరించుకుని మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, స్వామి వారికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

4న జాబ్‌మేళా

మహబూబాబాద్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 4(సోమవారం)న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ (మానుకోట)లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల ఎంపిక కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ లేదా బీటెక్ ఆపైన విద్యార్హతలు కలిగి.. 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు. 4న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం

- చినజీయర్ స్వామివారి తిరునక్షత్రోత్సవం



తిరునక్షత్రోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి మహాయాగం, కల్యాణోత్సవం, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు సత్యంగౌతం మహారాజ్ జీ, బాలకృష్ణ త్రిపాటి ఆధ్వర్యంలో డాక్టర్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామివారు శ్రీలక్ష్మీనృసింహస్వామి మహాయాగం జరిపి, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి 69వ తిరునక్షత్రోత్సవం పూజలు జరిపి, భక్తులకు తదియారాధన (అన్నప్రసాద వితరణ) చేసి, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అన్నదాతలుగా ఓంనారాయణ లోయ, రాజకుమారి లోయ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో పర్కాల శ్రీనివాసరెడ్డి, హేమలత, చౌడవరపు సుధాకర్, కొల్లూరి రవికుమార్, రూపిరెడ్డి శ్రీలత, కొండపల్లి కేశవరావు, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఉమాదేవి, బాపురెడ్డిఉష, ఇమ్మడి రవికుమార్, ఉష, పద్మ, సువర్ణ, రవీందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, మల్లీశ్వరీ, వాణి, రమేశ్ పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోకాల పోటీలు

త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి జన్మదినోత్సవంలో భాగంగా శ్రీవేణుగోపాల స్వామివారి దేవస్థానంలో శనివారం సాయంత్రం 5 గంటలకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నామని ఇమ్మడి రవికుమార్, రూపిరెడ్డి శ్రీలత పేర్కొన్నారు. 20 సంవత్సరములలోపు వయస్సుగల పిల్లలు భగవద్గీత ప్రథమ అధ్యాయంలోని అర్జున విషాద యోఘులోని శ్లోకాలపై పోటీలో పాల్గొనాలని తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

కురవి: మండలంలోని కందికొండ గ్రామంలోని కందగిరి పర్వతంపైగల శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించాలని అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో సూచించారు. శుక్రవారం కందికొండ గుట్ట వద్ద జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సౌకర్యవంతంగా జాతరను నిర్వహించేందుకు పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ తదితర శాఖల సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, పంచాయతీ కార్యదర్శి మద్దెల నరేశ్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు రెడ్యాల విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం సక్రు, పీడీ మోహన్ శుక్రవారం తెలిపారు. గతనెలలో ఏటూరునాగారం ఐటీడీఏలో జరిగిన ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల గిరిజన ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల బాలలకు అండర్ –17, అండర్ –14 గ్రూపు కబడ్డీ, ఖోఖో పోటీల్లో రెడ్యాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఏహెచ్‌ఎస్ నుంచి అండర్ –17 కబడ్డీలో పది తరగతి విద్యార్థులు అరవింద్, రాజేందర్, అండర్– 14 కబడ్డీలో ఎనిమిదో తరగతి విద్యార్థి గౌతం, అండర్ –17 ఖోఖోలో పదో తరగతి విద్యార్థులు సంతోశ్, రాకేశ్, అండర్ –14 ఖోఖోలో ఎనిమిదో తరగతి విద్యార్థులు వరుణ్, శ్రవణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు శనివారం ప్రారంభించనున్నట్లు పీఈటీ కొప్పుల శంకర్ తెలిపారు. అండర్ 17, 19 బాల, బాలికల విభాగంలో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాటు పూర్తయినట్లు వెల్లడించారు.

ఇన్‌చార్జ్‌లు.. డబుల్ డ్యూటీలు

- అదనపు బాధ్యతల్లో అధికారులు
- సగం శాఖల అధికారులకు ఇతర బాధ్యతలు
- ఎక్కడి పనులు అక్కడే..
- గ్రూప్–1 నియామకాలపై ఆశలు



సాక్షి, మహబూబాబాద్: పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన మహబూబాబాద్ జిల్లాలో సగం మంది జిల్లా అధికారులు డబుల్ డ్యూటీలు, ఇతర జిల్లాలకు ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. దీంతో రెండు డ్యూటీలు చేయలేకపోవడం.. రెండు జిల్లాల్లో పనిచేయడంతో ఎక్కడా పూర్తిస్థాయిలో పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారి పరిధిలోని పలు ఫైల్స్, పర్యవేక్షణ అంతంత మాత్రంగానే సాగుతోంది. దీంతో కార్యాలయాలు ఉన్నా.. అధికారులను కలిసే అవకాశం లేకుండా పోయిందని, పనులు ముందుకు సాగడం లేదని జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు.

డబుల్ డ్యూటీలు

జిల్లా నుంచి పలువురు అధికారులు బదిలీపై వెళ్లడం, పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్తవారు రాకపోవడంతో ఉన్నవారికే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారిగా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కళావతిభాయి ఖమ్మం వెళ్లింది. ఆమె స్థానంలో జిల్లాకు ఎవరూ రాకపోవడంతో తొర్రూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా ఉన్న మురళీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన రెండు డ్యూటీలు చేయాల్సి వస్తుంది. జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉన్న రామారావును రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేయడంతో విద్యాశాఖ ఏడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాజేశ్వర్‌కు డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సత్యనారాయణకు సూర్యాపేట జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు ఉన్నాయి. అదే విధంగా కార్మికశాఖ ఏఓగా విధులు నిర్వర్తించే రమేశ్ ఖమ్మం అధికారిగా ఉంటూనే మానుకోట జిల్లాలో అదనపు బాధ్యతలు నిర్వర్తింస్తున్నారు. తూనికలు కొలతశాఖ జిల్లా అధికారిగా ఉన్న విజయ్‌కుమార్ ఖమ్మం జిల్లాకు అదనపు అధికారిగా ఉన్నారు. బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సింహస్వామి.. ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా ఉన్న నర్మద.. ఎస్సీ సంక్షేమశాఖకు అదనపు అధికారిగా ఉన్నారు. బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ జిల్లా అధికారిగా ఉన్న శ్రీనివాస్ మైనార్టీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ అధికారిగా ఉన్నారు.

పనుల్లో జాప్యం

ఏ శాఖకు ఆ శాఖ విధులు నిర్వర్తించేందుకు అధికారులు లేకపోవంతో ఆయా శాఖల్లో సరైన సమయానికి ఫైల్స్ సిద్ధం చేయకపోవడం, ఉన్నతాధికారులకు వివరించే సమయం లేకపోవడంతో పలు కీలక ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రతీ మండలానికి, గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. దీంతో ఒకే అధికారి రక రకాల పనులు చేయాల్సిరావడంతో అసలు పనులను సకాలంలో చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా అంటేనే కొత్త అధికారులు రావడానికి ఆసక్తి చూపకపోవడం, పోస్టింగ్ ఇచ్చినా.. ఇతర ప్రాంతాలకు మార్చుకుంటున్నారని ప్రచారం. ఈ పరిస్థితిలో ప్రభుత్వం కొత్తగా నియామకాలు చేపట్టిన గ్రూప్–1 ప్రక్రియ పూర్తి అయితేనే జిల్లాలో ఖాళీగా ఉన్న జిల్లా అధికారుల పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

నేడు హనుమకొండలో బీసీ కమిషన్ సమావేశం

మహబూబాబాద్: వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో నేడు(శనివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు మానుకోట కలెక్టర్ కలెక్టర్అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తమ అభిప్రాయాలను తెలియచేసే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హనుమకొండకు చేరుకున్న బీసీ కమిషన్

హన్మకొండ: స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం నిర్వహించే విచారణలో పాల్గొనేందుకు బీసీ కమిషన్ బృందం శుక్రవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ చేరుకుంది. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి.. కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. బీసీ కమిషన్ బృందం శనివారం ఉదయం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే విచారణలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నుంచి వినతిపత్రాలు, దరఖాస్తులు, అభిప్రాయాలు స్వీకరిస్తుందని అధికారులు తెలిపారు.

ప్రజాసమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

డోర్నకల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలి స్వార్థపూరిత రాజకీయాలతో కాలం వెల్లదీస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బూరుగుపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ 8వ మండల మహాసభలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలు చేస్తూ సంఖ్యాబలం లేకున్నా ప్రాంతీయ పార్టీలను బెదిరిస్తూ ఏకపక్ష పాలన చేస్తుందని విమర్శించారు. ఒకే దేశం, ఒకే ఓటు పేరుతో రాజ్యాంగాన్ని ఖూనీ చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. హామీలు అమలు చేయకుండా హైడ్రా పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మహాసభలను పూర్తి చేసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమం చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. నాయకులు శెట్టి వెంకన్న, అశోక్‌కుమార్, లక్ష్మి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బొబ్బ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు కేయూ జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, పీడీ

కేయూ క్యాంపస్: బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో ఈనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ (పురుషుల) టోర్నమెంట్‌లో కేయూ జట్టు పాల్గొననుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య శుక్రవారం తెలిపారు. ఈ జట్టులో కె.యశ్వంత్ (యూసీపీఈ కేయూ), ఎం.ప్రణయ్‌కుమార్ (కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ కళాశాల), బి.ఈశ్వర్ (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), టి.విశ్వనాథ్, ఎం.ప్రవీణ్, గణేష్‌కుమార్ (ఎల్‌బీ కళాశాల వరంగల్), ఎండీ.మొయినొద్దీన్, కె.పవన్‌పాల్ (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), ఎస్.రాకేష్‌యాదవ్ (కిట్స్, వరంగల్), టి.కన్నారావు (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), సీహెచ్.ఈశ్వర్ (నలంద డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), ఆర్.నరేందర్ (ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల, ఖమ్మం) ఉన్నారు. ఈ జట్టుకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మోహన్ కృష్ణ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నట్లు వెంకయ్య తెలిపారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా టేబుల్‌ టెన్నిస్‌ ఎంపికలు



వరంగల్‌ స్పోర్ట్స్‌: పాఠశాల క్రీడల సమాఖ్య అండర్‌–14,17 బాలబాలికల ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి టేబుల్‌ టెన్నిస్‌ ఎంపిక పోటీలు శుక్రవారం హనుమకొండ ఇండోర్‌ స్టేడియంలోని రెజ్లింగ్‌ హాల్‌లో ఉత్సాహంగా జరిగాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్‌ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్‌ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 3, 4, 5వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో పీడీలు శ్రీలత, ప్రేమ్‌ప్రసాద్‌, ఎస్‌. శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్‌ ఎంపికలు..

ఈ నెల 3వ తేదీన హనుమకొండ జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి మెన్‌ అండ్‌ ఉమెన్‌ బాల్‌బ్యాడ్మింటన్‌ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్‌ బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 8వ తేదీన జేఎన్‌ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు జేఎన్‌ఎస్‌లోని బ్యాడ్మింటన్‌ మైదానం వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలులో జాప్యం

- ఎంఎస్పీ జాతీయ నాయకుడు రవిమాదిగ



హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలులో జాప్యం చేస్తోందని ఎంఎస్పీ జాతీయ నాయకుడు పుట్ట రవిమాదిగ అన్నారు. శుక్రవారం మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాల్సి ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల డీఎస్సీ నియామకాలు కూడా చేపట్టడం వల్ల మాదిగ అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాల సామాజిక వర్గానికి తలొగ్గి సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టారని ఆరోపించారు. ఇందుకు నిరసనగా ఈనెల 4న మాదిగ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో మేధావులు, విద్యార్థులు, యువకులు అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఎంఎస్పీ జిల్లా నాయకుడు మేకల రమేశ్‌ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు బోడ యుగంధర్‌, రవీందర్‌, సంగాల బాబు, ఆరెపల్లి పవన్‌, బొక్క కుమార్‌, రాజారపు భిక్షపతి, ఆకారపు స్వామి, రేణుకుంట్ల దుర్గాప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్‌.. నో పొల్యూషన్‌

- వరంగల్‌ రీజియన్‌కు చేరుకున్న 34 కాలుష్యరహిత ఎలక్ట్రిక్‌ బస్సులు
- త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి
- అధునాతన సౌకర్యాలు..

హన్మకొండ: వరంగల్‌ రీజియన్‌ రోడ్లపై తొలిసారి కాలుష్య రహిత ఎలక్ట్రిక్‌ బస్సులు పరుగులుపెట్టనున్నాయి. రీజియన్‌కు సూపర్‌ లగ్జరీ, డీలక్స్‌, సెమీ డీలక్స్‌, ఎక్స్‌ప్రెస్‌.. మొత్తం 82 ఎలక్ట్రిక్‌ బస్సులు కేటాయించగా ఇప్పటి వరకు 34 చేరుకున్నాయి. అత్యాధునిక హంగులతో కూడిన ఈ బస్సులు ఈ నెలలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ప్రధాన రూట్లలో తిప్పడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బస్సులకు చార్జింగ్‌ చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సబ్‌ స్టేషన్‌ నిర్మాణం పూర్తి కావొచ్చింది. చార్జింగ్‌ స్టేషన్‌ పనులు కొనసాగుతున్నాయి.

డ్రైవర్‌ సౌకర్యాలు..

- ప్రభావవంతమైన బ్రేకింగ్‌, మెరుగైన స్థిరత్వం కోసం యాంటీ లాక్‌ బ్రేకింగ్‌ సిస్టమ్‌తో ముందు, వెనుక డిస్క్‌ బ్రేక్‌లు.
- రివర్స్‌ పార్కింగ్‌ అలర్ట్‌ సిస్టమ్‌తో కూడిన రివర్స్‌ పార్కింగ్‌ సహాయక కెమెరా.
- డ్రైవర్‌ కోసం 7 కెమెరా డిస్‌ప్లేతో బస్‌ డ్రైవర్‌ కన్సోల్‌ (బీడీసీ).
- డ్యాష్‌ బోర్డులో ఉన్న క్లస్టర్‌లో డ్రైవర్లకు హెచ్చరిక సందేశాలు.
- వాహనం కదలిక కోసం డ్రైవ్‌, న్యూట్రల్‌, రివర్స్‌ బటన్‌, క్లచ్‌, గేర్‌ బాక్స్‌ ఉండదు.
- పవర్‌ స్టీరింగ్‌, ఎయిర్‌ కంప్రెషర్‌ ప్రత్యేక మోటార్ల ద్వారా బస్సులు నడపబడతాయి.
- సూర్యకాంతి నుంచి రక్షించడానికి డ్రైవర్‌ కోసం సన్‌ వైజర్‌ సౌకర్యం.
- ఫ్రంట్‌ విండ్‌ స్క్రీన్‌ గ్లాస్‌ నుంచి పొగమంచు తొలగించడానికి డిమిస్టర్‌ స్విచ్‌ సౌకర్యం

ఎలక్ట్రిక్‌ బస్సులో ప్రయాణికుల సౌకర్యాలు..

- సిట్టింగ్‌ కెపాసిటీ.. సూపర్‌ లగ్జరీ బస్సులో 41, డీలక్స్‌లో 45, 2+2 సిట్టింగ్‌ ప్యాటర్న్‌, ఎక్స్‌ప్రెస్‌లో 55, 2+3 సిట్టింగ్‌ ప్యాటర్న్‌ ఎర్గోనామిక్‌గా డిజైన్‌ చేయబడిన సీట్లు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసం ఫ్రంట్‌ –రియర్‌ ఎయిర్‌ సస్పెన్షన్‌.
- నెల బ్యాకప్‌తో రెండు అంతర్గత భద్రతా కెమెరాలు, క్యాబిన్‌లో ఒకటి, సెలూన్‌లో ఒకటి. ఒకటి ఫ్రంట్‌ వ్యూ కెమెరా, ఒకటి వెనుక వీక్షణ కెమెరా.
- వెహికల్‌ ట్రాకింగ్‌ సిస్టమ్‌ –పానిక్‌ బజర్‌ ప్రొవిజన్‌.



- ప్రతి సీటుకు మొబైల్‌ చార్జింగ్‌ సదుపాయం.
- అంతర్గత ప్రకటన కోసం పబ్లిక్‌ అడ్రస్సింగ్‌ సిస్టమ్‌.
- ప్యాసింజర్‌ డోర్‌ కాకుండా నిష్క్రమణ కోసం రెండు అత్యవసర డోర్లు.
- డోర్‌ క్లోజింగ్‌లో యాంటీ–పించ్‌ ఫీచర్‌, ప్రయాణికుడు నిలబడితే డోర్‌ మూసివేయడానికి అనుమతించదు.

వాహన లక్షణాలు..

- వందశాతం విద్యుత్‌, జీరో కాలుష్యంతో 12 ఎంసీ బస్సు.
- పూర్తి చార్జింగ్‌తో 360 కి.మీ దూరం వెళ్తుంది.
- సింగిల్‌ పిన్‌ చార్జింగ్‌తో రెండున్నర గంటల్లో పూర్తి చార్జింగ్‌, డ్యూయల్‌ పిన్‌ చార్జింగ్‌తో ఒకటిన్నర గంటలు, గంట పాటు ఇంటర్మీడియట్‌ చార్జింగ్‌.
- ఫైర్‌ డిటెక్షన్‌ –అలారింగ్‌ సిస్టమ్‌ (ఎఫ్‌డీఏ).
- 12 హైఓల్టేజ్‌ (హెచ్‌వీ) బ్యాటరీలు, రెండు లోఓల్టేజ్‌ (ఎల్‌వీ) బ్యాటరీలు.
- బస్సు గరిష్టంగా 80 కి.మీ.కి స్పీడ్‌ లాక్‌.
- వాహన ట్రాకింగ్‌, కెమెరాలు, ఎల్‌ఈడీ డిస్‌ ప్లే బోర్డులు, జీపీ ఆధారిత ప్రకటనలతో కూడిన ఇంటెలిజెంట్‌ ట్రాన్స్‌పోర్ట్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌.
- హోల్ట్‌ బ్రేక్‌ సిస్టమ్‌, ప్రయాణికుల, డ్రైవర్‌ తలుపులు తెరిచి ఉంటే వాహనం కదలికను నివారిస్తుంది.
- బ్యాటరీ కూలింగ్‌ సిస్టమ్‌, ట్రాక్షన్‌ మోటార్‌ కూలింగ్‌ సిస్టమ్‌ కలదు.
- రెండు ఎమర్జెన్సీ పవర్‌ కట్‌ ఆఫ్‌ స్విచ్‌లు. డ్రైవర్‌ దగ్గర ముందు ఒకటి, వెనుక మరోటి

ఈ నెలలో ప్రయాణికుల ముంగిటకు..



కాలుష్యరహిత ఎలక్ట్రిక్‌ బస్సులు ఈ నెలలో ప్రజల ముంగిటకు రానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. కొత్త ఎలక్ట్రిక్‌ బస్సులు హైదరాబాద్‌, నిజామాబాద్‌, ఏటూరు నాగారం, మంగపేట, ఖమ్మం, భూపాలపల్లి రూట్లలో నడపనున్నాం. అత్యాధునిక హంగులతో ఈ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

– డి.విజయభాను, ఆర్‌ఎం, ఆర్టీసీ వరంగల్‌

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్‌

- విప్లవ సాహిత్యం, పేలుడు సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్సై సూరి



మావోయిస్టుల అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి అటవీ శాఖ చెక్‌ పోస్టు వద్ద మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు కడతి కమల అలియాస్‌ లక్ష్మితో పాటు పార్టీ కొరియర్‌ వోయం మంగ్లును గురువారం అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై టీవీఆర్‌ సూరి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సీపీఐ(ఎంఎల్‌) మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు, పార్టీ కొరియర్‌ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరువైపు నుంచి ఏటూరునాగారం వైపునకు వస్తున్నారనే సమాచారం అందింది. దీంతో సిబ్బందితో పాటు బాంబ్‌స్క్వాడ్‌, క్లూస్‌టీం, సాక్షులను తీసుకుని భద్రాచలం వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తితో పాటు మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. పారిపోయేందుకు యత్నించగా పోలీసులు అప్రమత్తమై ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బాంబ్‌ స్క్వాడ్‌ ద్వారా తనిఖీ చేయగా వారి వద్ద 02 డిటోనేటర్లు, 05 జిలెటిన్‌ స్టిక్స్‌, సుమారు 05 మీటర్ల కార్డెక్స్‌ వైర్‌, 06 పెద్ద బ్యాటరీ సెల్స్‌, 02 పెన్‌డ్రైవ్‌లు, విప్లవ సాహిత్యాలు(ప్రజావిముక్తి మ్యాగజైన్‌ 01) స్మార్ట్‌ ఫోన్‌, 32 జీబీ స్కాన్‌డిస్క్‌ మెమోరీ కార్డు లభించాయి. అనంతరం సాక్షుల సమక్షంలో విచారించగా కడతి కమల అలియాస్‌ లక్ష్మిది ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా మద్దూరుదూలేడ్‌ చింతగుప్ప గ్రామం, కొరియర్‌ వోయం మంగ్లుది బీజాపూర్‌లోని బేతల్పర కోటగూడ అని తేలింది. మావోయిస్టు అగ్రనాయకులు బడే చొక్కారావు అలియాస్‌ దామోదర్‌, కంకణాలరాజిరెడ్డి అలియాస్‌ వెంకన్న ఆదేశాల మేరకు కమలను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అనంతరం మావోయిస్టు పార్టీకి కావాల్సిన వస్తువులు తీసుకుని బీజాపూర్‌కు రావాలనే వారి ఆదేశాల మేరకు భద్రాచలంలోని శ్రీ శ్రీనివాస నర్సింగ్‌హోంలో చికిత్స అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో భద్రాచలం నుంచి ఆటోలో వచ్చి బ్రాహ్మణపల్లి వద్ద దిగారు. ఏటూరునాగారం మీదుగా బీజాపూర్‌ వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉండగా పోలీసులకు పట్టుబడ్డారు. అనంతరం సాక్షుల ఎదుట విచారించగా తాము మావోయిస్టులమని అంగీకరించినట్లు ఎస్సై వెల్లడించారు. కాగా, అజ్ఞాతంలో ఉన్న సీపీఐ(ఎంఎల్‌) మావోయిస్టులు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోవాలని ములుగు ఎస్పీ శబరీష్‌ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాస ప్రక్రియలో భాగంగా నగదు ప్రోత్సాహంతోపాటు కుటుంబ పోషణ కోసం సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అడవుల్లో ఉంటూ ప్రాణాలు కోల్పోయి కన్నవారికి కడుపుకోత మిగిల్చొద్దన్నారు. జనజీవన స్రవంతిలో కలిసి తమ కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడపాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

అయాన్‌ పోలీస్‌ అకాడమీ నిర్వాహకుడి అరెస్ట్‌

మామునూరు: ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి కారణమైన అయాన్‌ పోలీస్‌ అకాడమీ చైర్మన్‌ ఎండీ. అన్వర్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మామునూరు ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌ గురువారం తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మహిళ ఖిలా వరంగల్‌ మండలం బొల్లికుంట క్రాస్‌ సమీపంలోని అయాన్‌ పోలీస్‌ అకాడమీలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. ఇటీవల శిక్షణార్థుల ఎదుట సదరు మహిళతోపాటు ఆమె తండ్రిపై అన్వర్‌ దాడికి పాల్పడ్డాడు. దీంతో అవమాన భారం భరించలేని సదరు మహిళ స్వస్థలం ఖమ్మం వెళ్లి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్వర్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌ తెలిపారు.

ఎస్సై వేధిస్తున్నారని చిరువ్యాపారి ఆత్మహత్యాయత్నం

రామన్నపేట : వరంగల్‌ మట్టెవాడ పీఎస్‌లో బుధవారం అర్ధరాత్రి ఎస్సై విఠల్‌ వేధిస్తున్నారని పేర్కొంటూ చిరువ్యాపారి శ్రీధర్‌ ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఎస్సై నవీన్‌, సిబ్బంది.. శ్రీధర్‌పై నీరు పోసి నిప్పంటించుకోకుండా కాపాడారు. వార్త కార్యాలయ గల్లీలో వ్యాపారం చేసుకుంటున్న తనను ఎస్సై విఠల్‌ వేధిస్తున్నాడని శ్రీధర్‌ ఆరోపించారు. కాగా, ఈ ఘటనపై విచారణ చేస్తామని ఇన్‌స్పెక్టర్‌ గోపి పేర్కొన్నారు. వార్త కార్యాలయ గల్లీలో ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌ రోడ్డుకు అడ్డంగా ఉందని, వాహనాలు ఇష్టానుసారంగా పార్క్‌ చేస్తున్నారని, దీనిని గమనించాలని సదరు వ్యాపారికి తెలిపామన్నారు. అతడిపై దురుసుగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు.

వరంగల్‌ ఐఎంఏ శాఖకు రాష్ట్ర స్థాయి అవార్డులు

ఎంజీఎం: అక్టోబర్‌ 30వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర సమావేశంలో ఐఎంఏ వరంగల్‌ శాఖ మూడు అవార్డులు సాధించినట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ అన్వర్‌, కార్యదర్శి డాక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. వరంగల్‌ జిల్లా ఐఎంఏ చేస్తున్న సేవలకు గాను రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈమేరకు జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ దిలీప్‌బన్సాలీ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ కాళీప్రసాద్‌ రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు వారు పేర్కొన్నారు. మేడారం సమక్క – సారలమ్మ జాతరలో మెడికల్‌ క్యాంపులు, సీపీడీ, సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డులకు ఎంపికైనట్లు అధ్యక్ష, కార్యదర్శులు వివరించారు. కార్యక్రమంలో విజయ్‌చందర్‌రెడ్డి, సుదీప్‌, శేషుమాధవ్‌, బందెల మోహన్‌రావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఐఎంఏ అధ్యక్ష,కార్యదర్శులు

విధి వక్రీకరించింది!

- ఏడాదిన్నర వ్యవధిలోనే దంపతుల మృతి
- విద్యుదాఘాతంతో తల్లి, అనారోగ్యంతో తండ్రి.
- అనాథలైన ఇద్దరు పిల్లలు



రామ్మూర్తి(ఫైల్‌)

ఏటూరునాగారం: విధి వక్రీకరించింది. ఏడాదిన్నర వ్యవధిలో దంపతులను పొట్టన పెట్టుకుంది. ఏడాదిన్నర క్రితం ఫ్రిడ్జ్‌ శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి భార్య చనిపోయింది. అప్పటి నుంచి మనోవేదనకు గురైన భర్త అనారోగ్యం బారిన పడి గురువారం రాత్రి మృతి చెందాడు. దీంతో ఆ దంపతుల పిల్లలు అనాథలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన మల్లెల రామ్మూర్తి (47), ధనలక్ష్మి (40) దంపతులు. ధనలక్ష్మి 2019లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీ చేసిన కొండాయి ఎంపీటీసీగా గెలుపొందింది. ఈ క్రమంలో గతేడాది జూన్‌ 5న తేదీన ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్‌ శుభ్రం చేస్తుండగా విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందింది. అప్పటి నుంచి రామ్మూర్తి మనోవేదనకు గురై అనారోగ్యం బారిన పడ్డాడు. అన్నీ తానై తన ఇద్దరు పిల్లలను సాకుతూ వచ్చాడు. అంతలోనే విధి తండ్రిని కూడా పిల్లలకు దూరం చేసింది. ఆరోగ్యం క్షీణించడంతో వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం తుదిశ్వాస విడిచారు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఇద్దరు ఆడపిల్లలను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకునేవారు. కేవలం ఏడాదిన్నర సమయంలో ఇద్దరు మృతి చెందారు. పెద్ద కుమార్తె దీపిక ఇంటర్మీడియట్‌ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా చిన్న కూతురు అంజలి ఐదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ చిన్నారుల రోదనలు మిన్నంటాయి. ఇక తమకు దిక్కెవరంటూ గుండెలవిసేలా విలపించారు. ఈ హృదయ విదారక ఘటన చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు.

నివాళులర్పించిన బీఆర్‌ఎస్‌ నాయకులు

అనారోగ్యంతో మృతి చెందిన కొండాయి గ్రామానికి చెందిన రామ్మూర్తి మృతదేహం వద్ద బీఆర్‌ఎస్‌ నాయకులు నివాళులర్పించారు. ఆయన మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజా పాషా, సంజీవరెడ్డి, చంద్రబాబు, అల్లి శ్రీనివాస్‌, మాదరి రామయ్య, కాళ్ల రామకృష్ణ, సాగర్‌, రాజు, వెంకటేశ్వర్లు, రాకేశ్‌, వెంకటేశ్‌, రాజేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ సత్యనారాయణకు అవార్డు

- 2019లో ఓ కేసు పరిశోధనలో ప్రతిష్టాత్మక కేంద్రీయ గృహమంత్రి దక్షత పదక్‌ పురస్కారం
- ప్రస్తుతం ఇంటెలిజెన్స్‌ వరంగల్‌ డీఎస్పీగా విధులు



సాక్షి ప్రతినిధి, వరంగల్‌: ఇంటెలిజెన్స్‌ వరంగల్‌ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఆడెపు సత్యనారాయణకు అత్యంత ప్రతిష్టాత్మకమైన 'కేంద్రీయ గృహ మంత్రి దక్షత పదక్‌' అవార్డు లభించింది. అంతు చిక్కని కేసులో పరిశోధన చేసి ఫలితాలు సాధించి దోషులకు శిక్ష పడేలా ఆధారాలు జతపరిచిన విషయంలో ఆయనకు ఈ పురస్కారం లభించింది. దేశవ్యాప్తంగా కేసుల పరిశోధనలో ఉత్తమ ప్రతిభ, స్పెషల్‌ ఆపరేషన్‌, ఇన్వెస్టిగేషన్‌, ఫోరెన్సిక్‌ సైన్స్‌ తదితర విభాగాల్లో ప్రతిభ చూపిన పలు రాష్ట్రాలకు చెందిన వివిధ కేడర్ల అధికారులకు కేంద్ర హోంమంత్రి ఆమోదంతో 2024 సంవత్సరానికి గాను 'కేంద్రీయ గృహమంత్రి దక్షత పదక్‌' అవార్డులు ప్రకటించింది. కొమురం భీం ఆసిఫాబాద్‌ జిల్లా లింగాపూర్‌ మండలంలో ఊరూరు తిరిగి పొట్టపోసుకునే ఓ మహిళపై లైంగికదాడి, హత్య చేసిన ఘటన 2019లో సంచలనం రేపింది. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపిన డీఎస్పీ సత్యనారాయణ.. నిందితులను అరెస్ట్‌ చేసి శిక్ష పడేలా ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు అన్ని కోణాల్లో విచారణ జరిపిన న్యాయస్థానం దోషులకు కఠిన శిక్ష విధించింది. ఈ కేసులో సమయస్ఫూర్తి, చాకచక్యం ప్రదర్శించినందుకు గాను సత్యనారాయణకు 2024 సంవత్సరానికి ఈ అవార్డు లభించింది.

సంతోషంగా ఉంది..

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. 2019లో ఆసిఫాబాద్‌ డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో యువతి హత్య కేసు సంచలనం కలిగించింది. ఉన్నతాధికారుల సలహాలు, ఇన్వెస్టిగేషన్‌లో స్థానికంగా లభించిన లీడ్‌తో కష్టపడి పనిచేస్తే దోషులు దొరికారు. సత్ఫలితాలు వచ్చాయి. ఇదే సమయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డుగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

–ఏ.సత్యనారాయణ, డీఎస్పీ, ఇంటెలిజెన్స్‌ వరంగల్‌

పండుగ పూట విషాదం..

- బైక్‌ను ఢీకొన్న కారు
- ఇద్దరు కార్మికుల దుర్మరణం
- గోవర్ధనగిరిలో ఘటన
- శోకసంద్రంలో బంధువులు



నారాయణరెడ్డి(ఫైల్‌)



రవీందర్‌(ఫైల్‌)

రఘునాథపల్లి: దీపావళి పండుగ పూట విషాదం నెలకొంది. హనుమకొండ– హైదరాబాద్‌ జాతీయ రహదారిపై గోవర్ధనగిరిలో యూటర్న్‌ వద్ద రోడ్డు దాటుతున్న టీవీఎస్‌ ఎక్సెల్‌ (బైక్‌)ను గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరికి చెందిన సంపతి నారాయణరెడ్డి, జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ నగర్‌కు చెందిన కడార్ల రవీందర్‌ గోవర్ధనగిరి శివారులోని ఆయిల్‌ కంపెనీలో ఒకరు సెక్యూరిటీ గార్డుగా మరొకరు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. గురువారం రాత్రి విధులు ముగించుకుని నారాయణరెడ్డి తన టీవీఎస్‌ ఎక్సెల్‌పై రవీందర్‌తో కలిసి స్వగ్రామాలకు బయలుదేరారు. జాతీయ రహదారిపై గోవర్ధనగిరిలో యూటర్న్‌ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హనుమకొండ నుంచి జనగామకు వస్తున్న గుర్తు తెలియని కారు.. ఎక్సెల్‌ను ఢీకొంది. దీంతో ఎక్సెల్‌పై ఉన్న ఇరువురు ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు నారాయణరెడ్డి మృతదేహంపై పడి రోదించిన తీరు అందరిని కలిచి వేసింది. మృతుడికి భార్య మదనమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే నారాయణరెడ్డి, రవీందర్‌ మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై మృతుడు నారాయణరెడ్డి కుమారుడు అనిల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌ తెలిపారు.

నివారణ చర్యలు శూన్యం..

జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాల జరుగుతున్నా వాటి నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాద స్థలంలో సరిగా హెచ్చరిక రేడియేషన్‌ లేకపోవడం, లైట్లు లేక అంధకారం నెలకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు. మీదికొండకు వెళ్లే ఈ యూటర్న్‌ వద్ద రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ ఇప్పటికే ఏడుగురు మృతి చెందారు. కొందరు గాయపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గోవర్ధనగిరి గ్రామస్తులు కోరుతున్నారు.

చేయిచేయి కలిపారు.. ఆలయం నిర్మించారు

- వెయ్యేళ్ల ఆలయానికి జీర్ణోద్ధరణ
- రూ. 3 కోట్ల భక్తుల విరాళాలతో పనులు
- పూర్తిగా రాతితో అద్భుత నిర్మాణం



నూతనంగా నిర్మించిన పంచకూట శివాలయం



శివలింగం

ఆత్మకూరు: గ్రామస్తులంతా చేయిచేయి కలిపారు. వెయ్యేళ్ల ఆలయానికి జీర్ణోద్ధరణ చేశారు. రూ.3 కోట్ల భక్తుల విరాళాలతో మండల కేంద్రంలో కాకతీయుల కాలంలో నిర్మించిన మహిమాన్విత పంచకూట శివాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్థపతులు ఈ ఆలయాన్ని నిర్మించారు.

చారిత్రక నేపథ్యం..

ఆత్మకూరు గ్రామంలోని మహిమాన్విత పార్వతిదేవి సమేత మహాదేవ పంచకూట శివాలయాన్ని 11వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించారు. కాకతీయుల పాలనలో త్రికూట ఆలయాలు ఎక్కువ నిర్మించారు. అయితే ప్రత్యేకంగా ఆత్మకూరు గ్రామంలో పంచకూట శివాలయాన్ని నిర్మించడం విశేషం. ఆలయంలో దక్షిణముఖంగా ఉన్న ప్రధాన ద్వారంలోపల గర్భగుడిలో శివలింగం ప్రతిష్ఠించారు. ప్రధాన గర్భగుడికి కుడివైపు రెండు గర్భగుడుల్లో రెండు శివలింగాలు, ఎడమ వైపు రెండు గర్భగుడుల్లో రెండు శివలింగాలు ప్రతిష్ఠించారు. ఈ ఐదు లింగాలను పంచభూతాలకు ప్రతీకలుగా ఏర్పాటు చేశారని ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొన్నారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పంచకూట ఆలయాన్ని కాకతీయులు నిర్మించగా అదే స్థలంలో భక్తులు కమిటీ ఏర్పాటు చేసుకుని పూర్తిగా రాతితో నిర్మించారు. 1250 సంవత్సరం నాటి కంతాత్మకూరు శాసనంలో పంచకూట ఆలయ వైశిష్ట్యాన్ని పొందుపర్చారు. కాకతీయ రాజులు, సామంతులు, జగద్గురువులు ఇక్కడ ప్రత్యేక పూజలు చేశారని పూర్వీకులు చెబుతున్నారు.ఆలయంలో నంది, వినాయకుడు, కుమారస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు.అలాగే, పార్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు.ఆలయంలో ధ్వజస్తంభం, ఆవరణలో నవగ్రహాలను ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయాన్ని పునఃనిర్మించాలని సంకల్పించి 2019 డిసెంబర్‌11న భూమిపూజ చేశారు. ఐదు సంవత్సరాల అనంతరం ఈనెల 8న ఆలయం పునఃప్రతిష్ఠ జరగనుంది. ఈ ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆపన్నహస్తం అందించరూ!

- తల్లిదండ్రులు, నానమ్మ మృతితో అనాథలైన పిల్లలు
- కుటుంబ పోషణకు అవస్థలు
- దాతలు, ప్రభుత్వం చేయూతనందించాలని వేడుకోలు

దీన గాథ



దాతలు, ప్రభుత్వ సాయం కోసం దీనంగా చూస్తున్న అన్నాచెల్లి

నర్సింహులపేట : అయ్యో పాపం.. ఆ కుటుంబానికి ఎన్ని కష్టాలు వచ్చాయి. అనారోగ్య కారణాలతో రెండు సంవత్సరాల వ్యవధిలోనే తల్లిదండ్రులు, మనోవేదనతో రెండు నెలల క్రితం నానమ్మ మృతి చెందారు. ఫలితంగా ఇంటి పెద్దలు చనిపోవడంతో ఆ కుటుంబం (అన్న, చెల్లి, తమ్ముడు) అనాథగా మారింది. ఒక పక్క ఆలనాపాలన చూసుకునే వారు లేక.. మరోపక్క కుటుంబ పోషణ చేపట్టే వారు లేక అవస్థలు పడుతోంది. దాతలు, ప్రభుత్వ సాయం కోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన జోగి వెంకన్న, వెంకటలక్ష్మి దంపతులు. వీరికి ముగ్గురు సందీప్‌, శ్రావణి, రాజేశ్‌ సంతానం. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై 2014లో తండ్రి వెంకన్న, 2016లో తల్లి వెంకటలక్ష్మి మృతి చెందారు. చిన్న వయసులో తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలను నానమ్మ(కొడుకు, కోడలు) అగండమ్మ కూలీ పని చేసుకుంటూ పోషించింది. ఈ క్రమంలో 2021 సంవత్సరంలో శ్రావణిని(మనుమరాలు)కురవి మండలం మొగిలిచర్లకు చెందిన రామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. అయితే 2024 జూన్‌లో ఆమె భర్త మృతి చెందాడు. ఈ దంపతులకు అప్పటికే నెల లోపు బాబు ఉన్నాడు. భర్త మృతి చెందడంతో కుమారుడిని తీసుకుని పుట్టింటికి వచ్చింది. ఒక వైపు కొడుకు, కోడలు.. మరోవైపు మనమరాలి భర్త మృతి చెందడంతో కుటుంబ పెద్ద అగండమ్మ మానసికంగా కృంగిపోయింది. రెండు నెలల క్రితం మృతి చెందింది. ఫలితంగా పిల్లలకు కుటుంబ పోషణ భారమైంది. అన్న, తమ్ముడు, భర్త చనిపోయిన చెల్లితో ఆ కుటుంబం అనాథలుగా మారింది. ఎలా బతకాలో తెలియని పరిస్థితి నెలకొంది. అన్న ఆటో కిరాయికి తీసుకుని వచ్చే డబ్బుతో చాలీచాలని జీవనం సాగిస్తున్నారు. వర్షం వస్తే ఎప్పుడు కూలుతుందోనే పూరిల్లు. ఇంత దయనీయ పరిస్థితిలో ఉన్న తమకు దాతలు, ప్రభుత్వం స్పందించి చేయూతనందించాలని ఆ కుటుంబ వేడుకుంటోంది. ఆర్థిక, వస్తు రూపేణ సాయం చేసి తమ కుటుంబాన్ని నిలబెట్టాలని సోదరులు, సోదరి చేతులెత్తి వేడుకుంటోంది. కాగా, వీరి దయనీయ పరిస్థితిని తెలుసుకున్న కురవికి చెందిన గుంటి సురేశ్‌, బొజ్జన్నపేటకు చెందిన చింతమల్ల యాకయ్య ఇన్‌స్టాగ్రామ్‌లో గంగరబోయిన రఘు వ్యక్తికి సమాచారం అందించారు. స్పందించిన రఘు.. ఇరాక్‌ ఆర్మీబేస్‌లో ఉద్యోగరీత్యా స్థిరపడిన మను అనే దాత, పలువురు దాతల సహకారంతో ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. దీంతో రఘును గ్రామస్తులు అభినందించగా, పేద కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.